క్లుప్తంగా

ఓటు వేసిన మాజీ ఎంపీ



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వల్లూరులో ఎమ్మెల్యే అబ్రహం, కొండేరులో మాజీ ఎంపీ మందా జగన్నాథం వారివారి కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటును వేశారు. ప్రతి ఒక్కరూ కూడా భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చుకోవాలని వారు సూచించారు.

ఓటు వేశారు.. పనులకు వెళ్లారు

ఉండవెల్లి: మండలంలోని ఓటర్లు గ్రామంలో ఉదయాన్నే ఓటు వేసి వ్యవసాయ పనులకు వెళ్లిపోయారు. గురువారం అన్ని గ్రామాల్లో ఉదయాన్నే ఓటు వెయ్యడానికి ప్రజలు అధిక



సంఖ్యలో పాల్గొని ఓటును వినియోగించుకున్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని వాసవికన్యకా పరమేశ్వరి ఆలయ సమీపంలోని కన్య స్వామి శ్రీనివాసులు ఇంట్లో గురువారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురు స్వాములు లక్ష్మీనారాయణ, ఎల్లయ్య, రఘు స్వామి ఆధ్వర్యంలో మాల ధరించిన అయ్యప్ప స్వాములు భజన భక్తి పాటలను పాడారు. వినాయకుని, కుమారస్వామి అయ్యప్పలకు అష్టోత్తర అర్చన చేశారు, అయ్యప్ప స్వామి 18 మెట్లను అందగంగా పూలతో అలంకరించిన మెట్లకు ప్రత్యేక పూజలను నిర్వహించి, స్వామి వారికి నివేధన పెట్టి, పెటతుళ్లిని అడారు. అయ్యప్ప స్వాములు అయ్యప్ప స్వామికి హరిహరాసనం, పవలింపు చేసి పూజ కార్యక్రమాలకు పరిసమాప్తి పలికి బిక్ష ఏర్పాటు చేశారు. మాలధరించిన అయ్యప్ప స్వాములు కృష్ణ, రాము, నవీణ్, శ్యామ్, రంగ, విజయ్ శ్రీనివాసులు, తదితర స్వామలు ,

పలువురిపై కేసు నమోదు

గద్వాల క్రైం:ఓటర్లను ప్రలోభాలతో తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేసేందుకు నగదు పంపిణీ చేస్తున్న ఆరుగురిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం రాత్రి షేరిల్లివీధి, గంటవీధి, సుంకులమ్మ మెట్టు, చింతలపేట, నవరంగ్ థియోటర్ ప్రాంతాల్లో ఓటర్లకు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు డబ్బులు పంచుతున్నట్లు గుర్తించి వారి నుంచి రూ.లక్ష 11వేల నగదును సీజ్ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



అయిజ: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బింగుదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల నరసింహులు బుధవారం ఉదయం తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలంకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున ఆయన ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. అది గమనించిన చుట్టుపక్కల ఇండ్ల వారు కాలిపోతున్న ఇంటి తలుపులు పగులగొట్టి మంటలు ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్, ఎల్ఈడీ టీవీ, ఇన్వార్టర్, విలువైన దుస్తులు కాలి బూడిదయ్యాయి. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అలంపూర్‌లో దివ్యాంగురాలిని ఓటు వేసేందుకు తీసుకెళ్తున్న సిబ్బంది



పుల్లూరులో ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



చిన్నతాండ్రపాడులో ఓటువేసి వేలును చూపుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, కుటుంబ సభ్యులు



బల్గెరలో ఓటు హక్కును వినియోగించుకున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బోయ శివారెడ్డి

ముగిసిన పోలింగ్

- తెల్లవారుజాము నుంచే బారులు తీరిన ఓటర్లు
- పలుచోట్ల కొద్దిసేపు మొరాయించిన ఈవీఎంలు
- కొన్ని చోట్ల 8గంటల దాకా పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు, ఎమ్మెల్సీ



ధరూర్ మండలంలోని 57వ బూత్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ క్యూ లైన్

అలంపూర్: అలంపూర్ నియోజకవర్గంలో అభ్యర్థులు తమ గ్రామాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆయన స్వగ్రామమైన ఉండవెల్లి మండలం పుల్లూరులో ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడు స్వగ్రామం పుల్లూరులో ఓటు వేశారు. అలంపూర్ మున్సిపాలిటీలోని హరిజనవాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో బీజేపీ అభ్యర్థి రాజగోపాల్, బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రసన్న కుమార్‌లు వేర్వేరు సమయాల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది.



బీజేపీ అభ్యర్థి రాజగోపాల్



అలంపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న కుమార్

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



ఇటిక్యాలలో ఓటును వినియోగించుకుంటున్న ఓటర్లు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 41,370 మంది ఓటర్లు ఉండగా, 31,767 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 76.79 శాతం పోలింగ్ నమోదైంది. ఈ సందర్భంగా 49 పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ అధికారులు ప్రత్యేక భద్రతను కల్పించారు. ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అయిజ మండలంలో 72 శాతం

అయిజ: మండల కేంద్రంలో, మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు చిన్న చిన్న ఆటంకాలు తప్ప ప్రశాతంగా ముగిశాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం అరగంటపాటు రెండు ఈవీఎంలు మొరాయించాయి. మండలంలోని కిష్టాపురంలో ఒక ఈవీఎం కొంచం సమయం మొరాయించింది. అధికారులు అప్రమత్తమై మరమ్మతు చేశారు. పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, అదర్ పోలింగ్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద తమ విధులు నిర్వహించారు. మండల కేంద్రంలో మొత్తం 54 పోలింగ్ కేంద్రాల్లో 45,321 మంది ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉండగా, 70 శాతం మంది ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 26 పోలింగ్ కేంద్రాలలో 22, 797 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవల్సి ఉండగా 72 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ సరళిని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడు పరిశీలించారు.



అయిజలో 5 గంటల అనంతరం ఓటర్లను గేటుబయట అడ్డుకున్న పోలీస్ అధికారులు



అయిజలో ఓటు వేసి వేలును చూపుతున్న దివ్యాంగురాలు

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు

గట్టు: సార్వత్రిక ఎన్నికల్లో గట్టు మండలానికి చెందిన ప్రముఖులు వారి స్వగ్రామాల్లో వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బల్గెరకు చెందిన మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు సతీమణి భువనేశ్వరితో పాటుగా కుమార్తెలు, కుమారులు కలిసి బల్గెరలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బల్గెర బోయ శివారెడ్డి బల్గెరలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్టేట్ కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప కుటుంబ సభ్యులతో కలిసి బల్గెరలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతు నాయుడు బల్గెరలో ఓటును వినియోగించుకున్నారు. స్టేట్ స్పోర్ట్స్ ఆథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడు తన స్వగ్రామం ఆలూరులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీపీ విజయ్‌కుమార్ చాగదోణలో వైస్ ఎంపీపీ సుమతి బోయలగూడెం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ ఆరగిద్దలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.



బల్గెరలో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు కుటుంబ సభ్యులు

అభ్యర్థి గ్రామంలో 83.81 శాతం పోలింగ్

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థి ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ స్వగ్రామంలో మొత్తం ఓట్లు 3,916 ఉన్నాయి. వాటిలో పురుషులు 1954, మహిళలు 1962 మంది ఉన్నారు. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో 3282 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 83.81 శాతం పోలింగ్ నమోదయ్యింది.

పోలింగ్ 30 శాతం..



ఉండవెల్లి: మండలంలోని శేరుపల్లె గ్రామంలో 83 ఏళ్ల వృద్ధురాలు ఓటును వినియోగించుకున్నారు. మండలంలో 83 శాతం పోలింగ్ అయ్యింది. మారమునగాల-2లో 30 నిమిషాలు మిషన్లు మొరాయించడంతో ఇబ్బందులు పడ్డారు. తర్వాత అధికారులు సరిచేయడంతో పోలింగ్ కొనసాగింది.

బాలింతలు.. గర్భిణులు



రాజోళి: మండలంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రమైన రాజోళితో పాటు ఆయా గ్రామాల్లో ఉదయం నుంచే ఓటు వేసేందుకు ఓటర్లు క్యూలో నిలబడ్డారు. వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. దివ్యాంగులు ఓటు వేసేందుకు వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి రాజోళిలోని పోలింగ్ సెంటర్లలో ఓటింగ్ సరళిని పరిశీలించారు. పలు చోట్ల యువత మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ ఓటు హక్కును వినియోగించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఆరుగంటల దాకా..



మల్దకల్: శాసనసభ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 52 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎన్నికల కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలను పోటీలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు పరిశీలించారు. ఎల్కూరులో సాయంత్రం 6గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



ఓటు వేసి వేలుచూపుతున్న యువతులు



బల్గెరలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు

మొరాయించిన ఈవీఎం..

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల దగ్గర ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల దగ్గర పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. మొత్తం 55 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. గట్టు, గొర్లఖాన్‌దొడ్డి, చాగదోణ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల ముందు ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్ల దగ్గరకు ఇరు పార్టీలకు చెందిన వారు ప్రచారం చేస్తున్నట్లు ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదులు చేసుకోవడంతో ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల దగ్గర స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. రెండు వర్గాల వారిని పోలింగ్ కేంద్రం నుంచి దూరంగా పోలీసులు పంపడంతో వివాదం సద్దుమణిగింది. గట్టులో ఏఐఎఫ్‌బీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రంజిత్‌కుమార్ ప్రాథమిక పాఠశాలలో 101, 102 పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు అనుచరులతో వెళ్లడంతో పోలీసులతో వాగ్వాదం చోటు చేసుకుంది.

మొరాయించిన ఈవీఎం..

గొర్లఖాన్‌దొడ్డిలోని 113 పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఈవీఎం ఓటింగ్ ప్రారంభించిన కొద్ది సేపటికే మొరాయించింది. దీంతో పోలింగ్ కేంద్రం బయట ఓటర్లు బారులు తీరారు. అధికారులు ఈవీఎంను మార్చి, పోలింగ్‌ను ప్రారంభించారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు..

గట్టు మండలంలోని వివిధ గ్రామాల్లోని పోలింగ్ సరళిని ఎమ్మెల్యే అభ్యర్థులు పరిశీలించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బోయలగూడెం, ఇందువాసి, బల్గెర, మాచర్ల, గట్టు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బల్గెర బోయ శివారెడ్డి గ్రామాల్లో పర్యటించి, పోలింగ్ సరళిని పరిశీలించారు. ఏఐఎఫ్‌బీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రంజిత్‌కుమార్ కూడా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

100 ఏళ్ల వృద్ధురాలు..

మానవపాడు: మండల కేంద్రంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7.00గంటలకు మండలంలోని అమరవాయి గ్రామంలోని 221 పోలింగ్ బూత్ నెంబర్‌లో 45 నిమిషాలు ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా ప్రారంభమైంది. జల్లాపురంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఓటు హక్కును వినియోగించుకున్నారు. వివిధ గ్రామాల్లో మండల పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ రాము ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూశారు. కొత్త పెళ్లి చేసుకున్న యువతి, యువకులు, 100 ఏళ్లు పూర్తి చేసుకున్న మాసుంబీ, అన్నాచెల్లెలతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు హక్కును వినియోగించుకున్న యువత

అలంపూర్ రూరల్: 18ఏళ్లు నిండిన యువతకు నూతనంగా ఓటు హక్కు కల్పించడంతో ఈ సారి యువత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని లింగన్‌వాయి గ్రామంలో నూతనంగా వివాహం అయిన నూతన దంపతులు మధుమిత పవన్‌లు తమ ఓటు హక్కును గురువారం జరిగిన ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఇమాంపూరం గ్రామనికి చేందిన హసీనా కూడా నూతనంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంది. అలంపూర్ పట్టణానికి చేందిన 3వ వార్డు కౌన్సిలర్ ఆకుల జయలక్ష్మీ కుటుంబ సభ్యులు అయిన రాధిక, ఆలేఖ్య, ధరిణి, గాయిత్రి, చరణ్‌లు కూడా మొదటిసారి యువత ఓటు హక్కును వినియోగించుకున్నారు



ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



లింగన్‌వాయిలో ఓటు వేసిన నూతన దంపతుల

కేటీదొడ్డి మండలంలో 33 పోలింగ్ కేంద్రాలు



ఓటు హక్కు నమోదు చేసుకున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఎమ్మెల్యే అభ్యర్థి రంజిత్‌కుమార్



పోలింగ్ బూత్‌లను పరిశీలించిన డీఎస్పీ

కేటీదొడ్డి: మండలంలో 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అక్కడక్కడ రాత్రి 7 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. యువకులు, మహిళలు, వృద్ధులు ఓటు నమోదు చేసుకున్నారు. చింతలకుంట గ్రామానికి చెందిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రంజిత్‌కుమార్, కేటీదొడ్డి గ్రా మానికి చెందిన స్వతంత్ర్య ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో వెళ్లి ఓటు నమోదు చేసుకున్నారు. నందిన్నె, కేటీదొడ్డిలోని పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించి అక్కడ జరుగుతున్న ఎన్నికలపై అడిగి తెలుసుకున్నారు.

రాత్రి 8గంటల దాకా పోలింగ్..

ధరూరు: శాసనసభ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటలకే ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా, సాయంత్రం వరకు ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తలేదు. మండల కేంద్రంలోని 57, 58వ పోలింగ్ కేంద్రాలలో భారీ క్యూలైన్లలో ఓటర్లు నిలబడి ఓట్లు వేశారు. సాయంత్రం 7 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. మండలంలోని మార్లబీడులో 45, 66వ పోలింగ్ కేంద్రాలలో రాత్రి 8 గంటలకు ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యింది.



ధరూరులో ఎండలోనే నిలుచుని ఓటు కోసం బారులు తీరిన జనం